క్లుప్తంగా

మదనగోపాలుడికి విశేషంగా తిరువీధి



మదనగోపాలస్వామి తిరువీధిలో అర్చకులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం సింహగిరిపై మదనగోపాలస్వామికి విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకిలో వేంజేపచేశారు. సాయంత్రం 5 నుంచి సింహగిరి మాడవీధిలో తిరువీధి వైభవంగా నిర్వహించారు. విశేష హారతులు అందించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని, ఆశీస్సులు పొందారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు పాలిటెక్నిక్ కాలేజీలో క్యాంపస్ ఎంపికలు

పెందుర్తి: హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ సంస్థలో ఉపాధి నిమిత్తం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు మంగళవారం క్యాంపస్ ఎంపికలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు.

ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉన్న స్కిల్ హబ్‌లో ఉచిత హ్యాండ్ ఎంబ్రాయిడరీ శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 3 నెలల పాటు జరిగే ఈ శిక్షణ కోసం 8వ తరగతి చదివి 18–45 ఏళ్ల వయసు కలిగిన మహిళలు అర్హులన్నారు. ఈ నెల 20లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 99669 65502 నెంబర్లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

పీజీఆర్ఎస్‌కు 19 వినతులు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 19 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో విస్తం విద్యార్థుల ప్రతిభ



విజేతలతో విస్తం కళాశాల హెచ్ఓడీలు

పెందుర్తి: ఐఐఎం ఆధ్వర్యంలో నగరంలో ఇటీవల నిర్వహించిన సమరంభ్ 9.0 డ్యాన్స్ పోటీల్లో పినగాడి సమీపంలోని విస్తం ఇంజినీరింగ్, డిప్లొమా విద్యార్థుల బృందం చక్కటి ప్రతిభ కనబరిచి, ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా సోమవారం కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఇ.కిరణ్‌కుమార్, ఎం.వి.జె.టి.అరుణ్, ఐఐఎం అంబాసిడర్ వి.రాజీ, ఎస్.శిరీష తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పాల్గుణ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సోమవారం రాత్రి సీతారాముల వార్షిక కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా ముస్తాబుచేసి కల్యాణమండపంలో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం అందించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రైమరీ స్కూల్లో ఎంఈవో పరిశీలన

సబ్బవరం: మండలంలోని చినగొల్లలపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి ఎం.జె.రవీంద్రబాబు సోమవారం పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం)లో భాగంగా విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్యాస్ స్టవ్‌లపై మాత్రమే వంట చేయాలని ఎండీఎం కార్మికులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న సమాచారానికి అష్టకష్టాలు

సింహాచలేశుడి దర్శనానికి వచ్చే భక్తులు సమాచార కేంద్రం అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో బస్సు దిగిన వెంటనే దర్శనం వేళలు, ప్రత్యేక సేవలు, కొండపైన ఉండేందుకు గదుల లభ్యత తదితర సమాచారం కోసం సెంట్రల్ రిజర్వేషన్ కమ్ సమాచార కేంద్రం అందుబాటులో ఉండేది. ప్రస్తుతం దాన్ని నృసింహ సదన్‌లోకి మార్చేశారు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సమాచారం తెలుసుకునేందుకు నానా యాతన పడుతున్నారు.

నాడు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అందుబాటులో సెంట్రల్ రిజర్వేషన్ కమ్ సమాచార కేంద్రం

నృసింహ సదన్‌లోకి తరలించడంతో యాత్రికుల ఇక్కట్లు

పాత స్థానంలోనే పునరుద్ధరించాలని కోరుతున్న భక్తులు

ఏర్పాటు చేసిన ఏడాదిన్నరకే మూసివేసిన అధికారులు



కొంతకాలం సేవలందించిన సెంట్రల్ రిజర్వేషన్ కమ్ విచారణ కేంద్రం



నృసింహసదన్‌లోని ప్రస్తుత సమాచార కేంద్రం వద్ద యాత్రికులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా సింహాచలం వస్తుంటారు. నగరంలోని ద్వారకా బస్‌స్టేషన్, ప్రధాన రైల్వేస్టేషన్, గోపాలపట్నం, సింహాచలం, మర్రిపాలెం రైల్వేస్టేషన్‌ల ద్వారా సింహాచలం చేరుకుంటుంటారు. ఇలాంటి వారు దేవస్థానానికి చెందిన కాటేజీల్లో బస చేసేందుకు గదుల వివరాలు, స్వామివారి దర్శన సమయాలు, ప్రత్యేక పూజలు, సేవల గురించి తెలుసుకోవడం ప్రస్తుతం ఇబ్బందిగా మారింది.

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద యాత్రికుల సౌకర్యార్థం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజర్వేషన్ కేంద్రాన్ని మూడేళ్ల కిందట నృసింహ సదన్‌కు తరలించేశారు. ఈ గదికి చేసిన ఇంటీరియర్ డెకరేషన్, తదితర హంగులు తొలగించడంతో దేవస్థానం సొమ్ము వృథాగా మారింది. ఆ గదిని కొంతకాలం దేవస్థానం నిరుపయోగంగా వదిలేసింది. ఆ తర్వాత అదే గదిని ఎక్కడా గదులే కొరవడినట్టు భూపరిరక్షణ విభాగానికి అప్పగించి చేతులు దులిపేసుకుంది.

సమాచారం.. సౌకర్యం

2019 అక్టోబర్ వరకు వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గంలో ఉన్న టీటీడీ సత్రంలో సమాచార కేంద్రం ఉండేది. అప్పటి ఈవో మార్రెళ్ల వెంకటేశ్వరరావు యాత్రికులకు అందుబాటులో ఉండేలా దీన్ని సింహాచలం ఆర్టీసీ బస్టాండ్ పక్కనున్న దేవస్థానం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేశారు. సెంట్రల్ రిజర్వేషన్ కమ్ సమాచార కేంద్రాన్ని ఆధునిక హంగులతో ప్రారంభించారు. సింహాచలానికి చెందిన కాటేజీలు, రిజర్వేషన్, ఆర్జిత సేవలు తదితర మొత్తం సమాచారం తెలిపేలా రాత్రీ, పగలు సిబ్బంది పనిచేసేవారు. ఆర్టీసీ బస్సు దిగగానే పక్కనే సమాచార కేంద్రం అందుబాటులో ఉండేది. దీంతో యాత్రికులు తమకు అవసరమైన సమాచారం తెలుసుకుని, ఆ మేరకు ఏర్పాట్లు చేసుకునేవారు.

కనిపించిన వారినల్లా అడుగుతూ..

ప్రస్తుతం వరాహ పుష్కరిణి వద్ద నున్న నృసింహ సదన్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజర్వేషన్ కమ్ సమాచార కేంద్రానికి వెళ్లాలంటే భక్తులకి గగనమే. సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి, మార్కెట్ కూడలి మీదుగా కనిపించినవారినల్లా వాకబు చేసుకుంటూ యాత్రికులు నృసింహసదన్‌కి వెళ్లాల్సి వస్తోంది. లగేజీలను మోసుకుంటూ వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. తీరా అక్కడికి వెళ్లాక గదులు లభిస్తే పర్లేదు.. లేకుంటే నిరాశగా వెనుదిరగాల్సి వస్తోంది. రాత్రి వేళల్లో నిర్మానుష్యంగా ఉండే మార్గంలో చిన్నారులు, మహిళలు, వృద్ధులతో వెళ్లాలంటే వెనుకడుగు వేయాల్సిన పరిస్థితి.

ఏడాదిన్నర ముచ్చటే..

ఆ తర్వాత అధికారుల మెదళ్లలో ఏం తట్టిందో తెలియదు. ఏడాదిన్నరకే సెంట్రల్ రిజర్వేషన్ కమ్ సమాచార కేంద్రాన్ని దేవస్థానం అధికారులు మూసివేశారు. సింహగిరి బస్టాండ్‌లో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత మరి కొద్ది రోజులకు వరాహ పుష్కరిణికి వెళ్లే నృసింహ సదన్‌లోకి మార్చారు. దీంతో యాత్రికులకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ఇప్పటికీ ఆ కష్టాలు కొనసాగుతూనే ఉన్నాయి. కరోనా సమయంలో కూడా శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సెంట్రల్ రిజర్వేషన్ సెంటర్ ద్వారా ఎన్నో సేవలు అందించారు. సింహగిరికి వెళ్లే భక్తులకు ఇక్కడే ఆధార్ కార్డులు తనిఖీ చేసి టిక్కెట్లు జారీచేశారు. ఇప్పుడా సేవలేవీ అందుబాటులో లేవు.

అందుబాటులో ఉండాలి



మేం టెక్కలి నుంచి స్వామివారి దర్శనానికి వచ్చాం. కొండ దిగువ బస చేసేందుకు దేవస్థానం గదులు అద్దెకు ఎక్కడ ఇస్తారంటూ పలువురిని అడుగుతూ నృసింహ సదన్‌కి వచ్చి, సమాచార కేంద్రంలో సంప్రదించాల్సి వచ్చింది. అదే అందరికీ అందుబాటులో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– క్రాంతి, టెక్కలి

దగ్గరగా ఉంటే మంచిది



కొండ దిగువ సమాచార కేంద్రం భక్తులకు అందుబాటులో ఉండాలి. ఎలాంటి ఇబ్బందులు పడకుండా అక్కడికి వెళ్లేలా ఉండాలి. బస్సు దిగగానే కొండపై అవసరమైన ఏర్పాట్ల గురించి, ఎంక్వయిరీ చేసేందుకు వీలుగా సమాచార కేంద్రం అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా చిన్నారులకు, వృద్ధులకు మరింత సౌలభ్యంగా ఉండాలి.

– అప్పారావు, గరివిడి

మా భూములకు పరిహారం ఇప్పించండి

• కలెక్టరేట్ వద్ద పెందుర్తి–నార్త్ సింహాచలం రైల్వే బ్రిడ్జి భూ నిర్వాసితుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

మహారాణిపేట/పెందుర్తి: పెందుర్తి– నార్త్ సింహాచలం రైల్వే స్టేషన్ల మధ్య నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం సేకరించే రైతుల పంట భూములకు పరిహారం ఇప్పించాలని రైతులు డిమాండ్ చేశారు. పెందుర్తి మండలం పార్లుపాలెం గ్రామ మాజీ వైస్ సర్పంచ్ గల్లా వెంకటరమణ ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో విశాఖ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమ తాత ముత్తాతల నుంచి చీమలపల్లి సర్వే నెం.86 నుంచి 89 వరకు, 111 నుంచి 115 వరకు, 126,127లలో వ్యవసాయం చేసుకుని ఉపాధి పొందుతున్నామన్నారు. తమ భూముల్ని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం సేకరించారని, కానీ తమకు నష్టపరిహారం ఇవ్వలేదని రైతులు వాపోయారు. ఫ్లైఓవర్‌కు తాము వ్యతిరేకం కాదని, ఈ భూములపైనే ఆధారపడి బతుకుతున్న తమకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పార్లుపాలెం, చీమలాపల్లి, లక్ష్మీపురం, చింతల అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతకు చంద్రబాబు వెన్నుపోటు



యువత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నేతలు

• 'యువత పోరు' పోస్టర్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: రాష్ట్రంలోని యువతను సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్‌కల్యాణ్ దారుణంగా వెన్నుపోటు పొడిచారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ఇప్పుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా వంచించారని ధ్వజమెత్తారు. రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు కలెక్టరేట్‌ల వద్ద బుధవారం తలపెట్టిన 'యువత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ మంత్రిగా ఉన్న విద్యాశాఖను ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేయాలన్నదే ప్రభుత్వం కుట్ర అని ఆరోపించారు. యువత పోరులో విద్యార్థులు, యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ సీనియర్ నాయకులు శరగడం చినఅప్పలనాయుడు, గండి రవి, బయిలపూడి భగవాన్ జయరామ్, బోకం రామునాయుడు, మనాలత జోబ్‌దాస్, గొరపల్లి శ్రీను, మెంటి మహేష్, రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగ్, గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, దాడి నూకరాజు, కొటాన రాము, దనిమిరెడ్డి శ్రీను, ఉగ్గిన గోవింద్, బోని నాయుడు, మహేష్, గొల్లవిల్లి వాసు, నియోజకవర్గంలోని నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న జేవీ సత్యనారాయణ, సీపీఐ నాయకులు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల హామీని నిలబెట్టుకోకపోతే రానున్న రోజుల్లో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడి గ్రామాన్ని తరలించకుంటే ఉద్యమిస్తాం

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



తాడిలో రోగులను పరామర్శిస్తున్న శ్రీనివాసరావు

పరవాడ: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను పదేపదే మోసగించడం అన్యాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం తాడి గ్రామంలో పర్యటించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించే వరకు ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మంచినీరు, గాలి, నేల కాలుష్యానికి గురికావడంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాన్ని తరలించని పక్షంలో ప్రజలతో కలిపి పోరాటం చేస్తామని హెచ్చరించారు. గ్రామాన్ని తరలించాలని కోరుతూ ఈ నెల 24న ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. రోగులను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ఆర్.శంకర్రావు, గనిశెట్టి సత్యనారాయణ, గండి నాయనబాబు, వివి రమణ, అప్పలరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

వెయ్యి మందికి మజ్జిగ వితరణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న వెన్న నాగరాజు

పెందుర్తి: స్థానిక సీడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మజ్జిగ వితరణ కార్యక్రమం చేపట్టారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు వెన్న నాగరాజు ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన వి.ఆంజనేయులు ఆర్థిక సహాయంతో దాదాపు వెయ్యి మందికి మజ్జిగతో దాహార్తి తీర్చారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా నాగరాజు పేర్కొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పెంచాలి



ఫార్మాసిటీలో నిర్వహించిన ర్యాలీలో సిటు నాయకులు

పరవాడ: ఫార్మా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పటిష్ట పరచాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో సుమారు 205 పరిశ్రమలు ఔషధాలను ఉత్పత్తి చేస్తుండగా, వాటిలో అనేక పరిశ్రమలు భద్రతను గాలికి వదిలేస్తున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత వివిధ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా జరిగిన ప్రమాదాల్లో 25 మంది కార్మికుల ప్రాణాలు పోగా, 59 మంది క్షతగాత్రులుగా మిగిలినట్లు తెలిపారు. సినర్జీన్ ఫార్మా ప్రమాదం జరిగిన తర్వాత ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారి మిశ్రా కమిటీ నివేదిక ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాలకు అండగా భద్రత ఆడిట్‌ను నిర్వహించకపోవడం, ప్రమాదాలు ఆధారంగా యాజమాన్యాలపై చర్యలు తీసుకోకపోవడంతో భద్రత మరింత క్షీణిస్తోందన్నారు. భద్రతా వారోత్సవాలు నిర్వహించడం తప్ప, పరిశ్రమల్లో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించట్లేదన్నారు. కార్యక్రమంలో సిటు నాయకులు పి.చిన్నారావు, కేదార్ బాబు, కృష్ణ పాల్గొన్నారు.

దువ్వపాలెంలో కొలువుదీరిన సీతారాముడు

• శాస్త్రోక్తంగా రామాలయంలో విగ్రహాల ప్రతిష్టాపన



విగ్రహ ప్రతిష్టాపన పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, భక్తులు



నూతన రామాలయంలో కొలువుదీరిన సీతారాములు

పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడ పంచాయతీ దువ్వపాలెంలో సీతా సమేత కోదండరాముడు సోమవారం కొలువుదీరాడు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఉదయం 9.22 గంటలకు రామ, సీత, లక్ష్మణ, ఆంజనేయ, వినాయక, సరస్వతిదేవి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ యంత్ర, శిఖర ప్రతిష్ఠ వేదమంత్రోచ్ఛరణల నడుమ చేశారు. అనంతరం సీతారాములు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రామాలయ శిఖర పూర్వక యంత్ర త్రిరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన హోమాలను పూర్ణాహుతి ఇచ్చారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్న సమారాధనలో దాదాపు 4 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం శాంతికల్యాణం వైభవంగా జరిపారు. కోలాటాలు, గరిడీలు, మేళతాళాల నడుమ గ్రామ పురవీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు సందడిగా జరిగింది. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ మధుపాడ నాగమణి, సర్పంచ్ బొడ్డు చంద్రావతి ప్రకాష్, కార్పొరేటర్లు బల్ల శ్రీనివాసరావు, ముమ్మన దేముడు, నాయకులు బయిలపూడి భగవాన్ జయరామ్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, గండి రవి, ఉప్పిలి కనకరాజు, మధుపాడ అంజి, శానాపతి శంకర్రావు, రెడ్డి నారాయణరావు, గనిశెట్టి కనకరాజు, నందవరపు అప్పలరాజు, బందారు అప్పలనాయుడు, కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకున్నారు.

చెరువులో బయటపడిన మృతదేహం



సూర్యలక్ష్మీనారాయణ మృతదేహం

పరవాడ: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతైన భర్నికం గ్రామానికి చెందిన యువకుడు బలిరెడ్డి సూర్యలక్ష్మీనారాయణ మృతదేహం సోమవారం లభ్యమైందని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. చిన్న వయస్సులో మృతి చెందిన లక్ష్మీనారాయణ మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వివరాలిలా ఉన్నాయి. సూర్యలక్ష్మీనారాయణ తన మిత్రులతో స్థానిక పెద్ద చెరువులో చేపలు పట్టడానికి ఆదివారం మధ్యాహ్నం దిగాడు. ప్రమాదవశాత్తు లోతు ప్రదేశంలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు చెరువులో రాత్రి వరకు మృతదేహం కోసం గాలించినా ఫలితం దక్కలేదు. సోమవారం ఉదయానికి మృతదేహం నీటిలో బయటపడింది. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. వివాహం కావాల్సి ఉంది. మృతుడికి తల్లిదండ్రులు నీలమ్మ, లోవరాజు, ఇద్దరు అన్నదమ్ములు, ఓ సోదరి ఉన్నారు. కేసును సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ బి.కృష్ణారావు దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన భద్రతా వారోత్సవాలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి

పరవాడ: కార్మికులు భద్రతాప్రమాణాలు పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి సూచించారు. 54వ భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా ఫార్మాసిటీ కామన్ ఎఫ్లూమెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్(సీఈటీపీ)లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణ, జిల్లా అగ్నిమాపక అధికారి వెంకటరమణ, ఫార్మాసిటీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ, అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

– సింహాద్రి ఎన్టీపీసీలో భద్రత ప్రమాణాల పట్ల సంస్థ నిబద్ధతతో వ్యవహరిస్తోందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ అన్నారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలు సింహాద్రి ఎన్టీపీసీ ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈడీ సమీర్‌శర్మ మాట్లాడుతూ ప్లాంటులో భద్రత చర్యలు నిరంతరం మెరుగుపర్చడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ ఏజీఎం ప్రశాంత కుమార్ జెనా, ఈఎండీ డీజీఎం రాజేంద్రన్ సింగ్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.